క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మల్దకల్: మండలంలోని మద్దెలబండ గ్రామానికి చెందిన పాపమ్మ గురువారం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, సర్పంచ్ జయమ్మ, నారాయణ తదితరులు ఉన్నారు.

సహాయ కేంద్రం ఏర్పాటు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ (ఎంఏఎల్‌డీ) డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపతి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కోసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 20న వెబ్ ఆప్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. సహాయ కేంద్రంలో దోస్త్ కో ఆర్డినేటర్‌గా హరిబాబు, టెక్నికల్ అసిస్టెంట్‌గా అనిల్ కుమార్‌లను నియమించినట్లు, మరిన్ని వివరాలకు సెల్: 8309746226, 8919705736 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మేడికొండను మండలం చేయాలి



అయిజ: ఆర్డీఎస్ ఆయకట్టు ప్రాంతానికి కేంద్రంగా ఉన్న మేడికొండను నూతనంగా మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు స్వగ్రామంలో చేపట్టిన నిరాహారదీక్ష గురువారంనాటికి నాల్గో రోజుకు చేరుకుంది. మేడికొండ గ్రామం రవాణా పరంగా అన్ని గ్రామాలను కలిపేందుకు కేంద్రంగా ఉందన్నారు. మండల కేంద్రంగా ప్రకటించడానికి అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. నూతన మండలంగా ప్రకటించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

24న పాలెంలో విత్తన మేళా

మానవపాడు: ఈ నెల 24న నాగర్‌కర్నూల్ జిల్లా పాలెంలో విత్తన మేళా, ప్రదర్శన నిర్వహిస్తునట్లు వ్యవసాయ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెం వారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రకరకాల విత్తనాలు విక్రయానికి అందుబాటులో ఉంటాయని, పంటలసాగుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యవసర సరుకులు అందజేత

గద్వాల అర్బన్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబానికి గురువారం లైఫ్‌ఛేంజ్ ఫౌండేషన్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిత్యావసర సరుకులను అందజేశారు. 50 కిలోల బియ్యం, కందిపప్పు, కారం, పసుపు తదితర సరుకులను ఫౌండేషన్ ఫౌండర్ పరశరాముడు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న 938 క్వింటాళ్ల కొనుగోలు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో గురువారం 938 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 6372 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని సూచించారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

మానవపాడు: మండలంలోని మద్దూరులో కాంగ్రెస్ కార్యకర్త సుజాత మృతిచెందింది. దీంతో ప్రమాదబీమా రూ. 2లక్షలు మంజూరైంది. గురువారం బాధిత కుటుంబసభ్యులకు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ చెక్కు అందజేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమదవాశాత్తు మృతి చెందితే రూ.2 లక్షల ప్రమాదబీమా, గాయపడ్డవారికి రూ.50 వేలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు



మానవపాడు: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

జీలుగ సాగు.. లాభాలు బాగు

- సేంద్రీయ ఎరువులతోనే అధిక దిగుబడి
- పచ్చిరొట్ట ఎరువులతో పెరుగుతున్న భూసారం
- అందుబాటులో సబ్సిడీ విత్తనాలు



కొండపేటలో రైతు సాగు చేసిన జీలుగ పంట



పచ్చిరొట్ట ఎరువుల సాగుపై వ్యాస దీపికను పంపిణీ చేస్తున్న ఏడీఏ(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: నీటి వసతి ఉన్న ప్రాంతాలతో పాటు జూరాల ఆయకట్టు కింద ఉన్న రైతులు కూడా వరిపంట సాగుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. జూరాల కుడి కాల్వ పరిధిలో డీ 31 నుంచి డీ 38 కాల్వల ఆయకట్టు రైతులు సుమారు 20 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగుచేస్తున్నారు. ఇటిక్యాల మండలంలోని మొగిలి రావులచెర్వు, మునుగాల, నక్కలపల్లి, కొత్తదేవరపల్లి, పుటాన్‌దొడ్డి, కోదండాపురం, పుటాన్‌దొడ్డి, జింకలపల్లి, కొండేరు, షేకుపల్లి, సాసనూలు, ఎర్రవల్లి, తిమ్మాపురం, యాక్తాపురం, కొండపేట తదితర గ్రామాలలో వరిసాగు అధికంగా ఉంది. వరిని పండించే రైతులు పెట్టుబడిని తగ్గించేందుకు గాను జీలుగను సాగు చేయడానికి ఎక్కువగా ముందుకు వస్తున్నారు. వరి పంటను సాగు చేసే ముందు దుక్కి దున్ని జీలుగ విత్తనాలను వేస్తారు. ఈ పంట వేసిన 40 రోజుల తర్వాత ఏపుగా పెరిగిన వెంటనే దుక్కి ద్వారా కలియ దున్నడంతో భూసారం పెరిగి పంటలు చీడ పీడల బారిన పడకుండా కాపాడుతూ అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

పంట మార్పిడితో ప్రయోజనాలెన్నో..

ప్రతి సారి పంటల మార్పిడిని తప్పకుండా చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. భూసారాన్ని పెంచి అధిక దిగుబడిని సాధించేందుకు జీలుగ పంట ఎంతో దోహదం చేస్తుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మార్కెట్‌లో 30 కేజీల జీలుగ విత్తనాల ధర రూ. 2415 ఉండగా సబ్సిడీపై రూ. 845 కే ప్రభుత్వం అందిస్తుంది. ప్రస్తుతం పంటల సాగు విధానంలో మార్పుల వల్ల ఏ గ్రామంలో ఏఏ పంటలు సాగు చేయాలో కూడా వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందించి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

సాగు విధానం ఇలా..

వర్షాకాలం ఆరంభం కాగానే వరి పంటను వేసే పొలంలో ఎకరాకు 25 కిలోల చొప్పున జీలుగ విత్తనాలను పది కిలోల యూరియాతో కలిపి వెదజల్లాలి. విత్తనాలను వెదజల్లిన తర్వాత ట్రాక్టర్‌తో దుక్కిని తప్పకుండా దున్నాలి. వర్షాభావ పరిస్థితుల ఆధారంగా 30 నుంచి 40 రోజులలో జీలుగ పంట ఏపుగా ఎదిగి పూత దశకు చేరుకుంటుంది. పూత దశలోకి రాగానే జీలుగ పంటను ట్రాక్టర్ రోటవేటర్ లేదా కాడెద్దుల సహాయంతో భూమిలోకి దున్ని వేయాలి. దున్నిన తర్వాత సింగిల్ సూపర్ పాస్ఫేట్ ఎరువును భూమిలో చల్లాలి. అనంతరం ఆ దుక్కికి నీళ్లు పారబెట్టడం వల్ల జీలుగ పంట పూర్తిగా కుళ్లిపోయి పచ్చి రొట్టె ఎరువుగా తయారవుతుంది.

ఉపయోగాలు..

జీలుగ ప్రధాన పంటకు కావలసిన బలాన్ని ఎక్కువగా అందిస్తుంది. జీలుగను సాగు చేయడం వల్ల వరి పంటకు కావలసిన మూడు టన్నుల ఎరువు పచ్చి రొట్టె ఎరువుల ద్వారా లభిస్తుంది. దీనివల్ల మొక్కలకు రెండు శాతం నత్రజని, జింక్ సూపర్ పాస్ఫేట్ అదనంగా అందుతుంది. అదేవిధంగా వానపాముల యొక్క ఉత్పత్తికి పచ్చి రొట్టె ఎరువులు దోహదం చేస్తాయి. జీలుగ లెగ్మిన్ జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో అధికంగా నత్రజనిని కలిగి ఉంటుంది. దీని వల్ల పంటలలో అధికంగా మొలిచే తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను ఎదగకుండా ఇవి అడ్డుకుంటాయి. జీలుగ మొక్కలను భూమిలోకి కలియ దున్నడం వల్ల నత్రజని 27శాతం, భాస్వరం 53 శాతం, పొటాషియం 22 శాతంను పంటలోని మొక్కలకు అందిస్తాయి. ముఖ్యంగా వరి పంటల్లో జీలుగను వాడటం వల్ల రసాయనిక ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గడంతో పాటు రైతులకు పంట ఖర్చు తగ్గుతుంది.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు..



నేలను సారవంతం చేయడంతో పాటు అధిక దిగుబడులను సాధించేందుకు రైతులు పచ్చిరొట్ట ఎరువులను తప్పనిసరిగా వినియోగించాలి. ప్రభుత్వం 65 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు నేరుగా జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం పుటాన్‌దొడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 30 క్వింటాళ్ళు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

– అయూబ్, ఏఓ, ఇటిక్యాల

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జీలుగతో పాటు జీవామృతం తయారీ విధానం, భూసారం పెంపు కోసం పాటించవల్సిన పద్ధతులను కూడా వివరిస్తున్నాం. భూసార పరీక్షలు నిర్వహించి ఏఏ పంటలను సాగు చేయాలో రైతులకు తెలియజేస్తున్నాం. రైతులు పంట సాగులో సేంద్రియ ఎరువులు వాడటంతో పాటు తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి సాధించడానికి వ్యవసాయ అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలి.

– సక్రియనాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు, అలంపూర్

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి



గొర్రెల కాపరులతో మాట్లాడుతున్న డాక్టర్ పుష్పలత

శాంతినగర్: ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలని పశు వైద్యశాల డాక్టర్ పుష్పలత అన్నారు. గురువారం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో గొర్రెల కాపరులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీని కాపరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా ఎదిగి ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీని ఉంటుందని వివరించారు. పశు వైద్య సిబ్బంది, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



మహారాజ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

శాంతినగర్: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ సర్పంచ్ కళావతి భర్త మహారాజ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జూలెకల్ గ్రామానికి వెళ్లి బాధితుడి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచించారు. అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట బీఆర్ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, మాణిక్యారెడ్డి, తిమ్మారెడ్డి, సూరిబాబురెడ్డి, భాస్కర్ రెడ్డిలు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు



నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్



గద్వాలలో తనిఖీలు చేస్తున్న అధికారులు

కేటీదొడ్డి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు రాష్ట్ర సరిహద్దు నందిన్నె, ఇర్కిచేడులో గురువారం ఎస్‌ఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీదుగా వాహనాల రవాణాపై స్పెషల్ ఫోకస్ పెట్టామన్నారు. ప్రతి వాహనాన్ని క్షణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో నకిలీ విత్తన నేరాలకు పాల్పడిన వ్యక్తులపై నిఘా ఉంచామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట కానిస్టేబుల్ రజినీ తదితరులు ఉన్నారు.

గద్వాల రూరల్: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఏఓ ప్రతాప్ కుమార్, రూరల్ ఎస్‌ఐ ఆనంద్ హెచ్చరించారు. గురువారం రాత్రి గద్వాల పట్టణం, మండల పరిధిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. వారి వెంట ఆయా శాఖల సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

మానవపాడు: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎస్సీ రుణాలను మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఎక్స్‌గ్రేషియో కొంతకాలంగా విడుదల చేయడం లేదని వాపోయారు. వెంటనే చైర్మన్‌ను, సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలిక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపానికి గురికావొద్దు



అమరచింత: ప్రస్తుతం రోజురోజుకూ ఎండలు మండుతున్నాయని, రోజు వారీగా 41 డిగ్రీల పైచిలుకు ఉష్ణోగ్రత నమోదవుతుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా అన్నారు. పట్టణంలోని దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం బాటసారులతో పాటు చల్లటి మంచి నీటిని తాగేందుకు వస్తున్న వారికి వేసవి ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈమేరకు కలాంపాషా మాట్లాడుతూ శరీరం డీహైడ్రేట్ కాకుండా నీటి శాతం ఎక్కువగా ఉన్న కూరలు తినాలన్నారు. భోజనంలో సోర, బీర, దోసకాయ, ఆకుకూరల వంటకాలు ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. కీరదోస, పుచ్చకాయ, దానిమ్మ, కర్బూజ లాంటి పండ్లు అధికంగా తినాలన్నారు. వేసవిలో చల్లదనం కోసం మద్యం తాగితే శరీరం త్వరగా డీహైడ్రేట్ అవుతుందన్నారు. దీంతో త్వరితంగా అనారోగ్యంకు గురి అయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు సర్దార్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

2న క్విజ్ పోటీలు

గద్వాల అర్బన్: వచ్చే నెల జూన్ 2వ తేదీ రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తునట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీలోగా సెల్: 7661899899కు మిస్ కాల్ చేసి వచ్చిన లింక్ ద్వారా పూర్తి వివరాలు నమోదు చేయాలని కోరారు. గెలుపొందిన వారికి మొదటి, రెండో, మూడో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. యూత్ డిక్లరేషన్ సందర్భంగా యువతలో స్ఫూర్తి నింపేందుకు పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు

గట్టు: మండలంలోని ఆలూరు, తుమ్మలచెరువు, బల్గెర గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. గురువారం మూడు గ్రామాల్లో మొత్తం 402 మందికి కంటి పరీక్షలను నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇందులో 24 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, మరో 31 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వైద్యాధికారులు తిమ్మప్ప, సమీరాకౌసర్, సాయిచరణ్, సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్ఎం భారతి, రావేల, ఖేజీయా, పాల్గొన్నారు.



ఎంపీపై చర్యకు డిమాండ్



గద్వాల అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగికంగా వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీపై వెంటనే చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో సీఐటీయూ, ఏఐకేఎస్, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు, ఐద్వా, మహిళా సంఘం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వీవీ నర్సింహ, బీకే ఈదన్న, నర్మద, రేపల్లే దేవదాసు తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి



శాంతినగర్‌లోని జూలెకల్‌లో..

ధరూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదామని జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జాంపల్లిలో నిర్వహించిన పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లో గుంతలు పూడ్చి వేయాలని, రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, హరితహారం కింద మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామం సమీపంలో పెంటకుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కార్మికులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గణపతి, ఎంపీఓ కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

శాంతినగర్: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రవీందర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చేపడుతున్న శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, మురుగుకాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సమీపంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న పూడికతీత పనులను ఎంపీడీఓ పరిశీలించారు. కూలీలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీడీఓ వెంట ఎంపీఓ తిరుపతన్న, ఏపీఓ విజయలలిత, నాగరాజు, రాజ్ కుమార్, ఉప సర్పంచ్ కృష్ణలు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. అప్పటి విద్యార్థులు, ఉపాధ్యాయులంతా కలసి ఒక చోటకు చేరుకుని, తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి పాఠశాలలో గడిపిన క్షణాలు, తీపిగుర్తులను గుర్త చేసుకొని మురిసిపోయారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు నగేష్‌బాబు, మద్దిలేటి, కృష్ణయ్య, అమరేష్‌బాబు, నర్సింహులు, వెంకన్న, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ప్రకాష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంపద వనం ఏర్పాటుకు స్థల పరిశీలన



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్, మండల పరిషత్ అధికారులు

ధరూరు: మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద సంపద వనం ఏర్పాటుకు గురువారం ప్రభుత్వ స్థలాన్ని ఇరిగేషన్, మండల పరిషత్ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశానుసారం రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను పరిశీలించి అనువైన స్థల ఎంపిక కోసం పీజేపీ ఏఈ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ ఎండీ జబ్బార్‌లు చర్చించారు. దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ పొలం ఉన్నప్పటికీ నిర్వాసిత రైతులు ఇప్పటికీ వివిధ పంటలు సాగు చేసుకున్నట్లు గుర్తించారు. సంపద వనం కార్యక్రమంలో భాగంగా పండ్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించింది. సంబంధిత నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



గద్వాల ఆర్డీఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న వీఓఏలు

గట్టు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిత సమ్మె గురువారం నాటికి 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు గద్వాల ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని విన్నవించారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.10 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులను జారీ చేయాలని, వీఓఏల గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు సురేష్, వీరేష్‌గౌడ్, నాగరాజు, మహాదేవ్‌గౌడ్, వీరన్న, వెంకటేష్, మునేశ్వరి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఓఏల సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కొనసాగింది. కార్యక్రమంలో వీఓఏల సంఘం శంకర్‌గౌడ్, తిమ్మప్ప, గోవిందు, లోకనాత్, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఎస్తేర్, తిరుమలేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఎండలో తిరగనీయొద్దు



గ్రామస్తులతో చర్చిస్తున్న అధికారులు

శాంతినగర్: రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతోందని పిల్లలను ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలో బుడమొర్సులో గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, పాఠశాలలో మౌలిక వసతులు, పాఠశాలలో మరమ్మతు, బాల కార్మికులు లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం సర్పంచ్ తిమ్మప్ప మాట్లాడుతూ బాల కార్మికుల, బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి సాత్విక మాట్లాడుతూ పాఠశాలలో మైనర్ రిపేర్లు చేయిస్తున్నామని పాఠశాల ప్రారంభంనాటికి పూర్తిచేస్తామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మి, ఆఫ్తాల్మిక్ డాక్టర్ లక్ష్మీనారాయణ, సీఆర్‌పీఎఫ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పనులకు పంచాయతీ ట్రాక్టర్ వినియోగం

గట్టు: మండల పరిధిలోని ఇందువాసి పంచాయతీ ట్రాక్టర్‌ను సర్పంచ్ జీవమ్మ మనవడు మెకానిక్ సతీష్ సొంత అవసరాలతో పాటుగా కిరాయి పనులకు ఉపయోగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బుధవారం రాత్రి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో ప్రైవేట్ పనులు చేస్తుండగా గ్రామస్తులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. పంచాయతీ పనులకు ఉపయోగించాల్సిన ట్రాక్టర్‌ను సొంత పనులకు వినియోగించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కిరాయి పనులకు తీసుకెళ్లడం ఎంత వరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఇందువాసి గ్రామస్తులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై సర్పంచ్ జీవమ్మను వివరణ కోరగా ఇప్పటివరకు తన దృష్టికి రాలేదని పంచాయతీ ట్రాక్టర్‌ను ప్రైవేట్ పనులకు వినియోగించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కేటీదొడ్డి: క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీడీఓ మమ్మద్ హజర్ మోహిద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో క్రీడాప్రాంగణ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఆయన వెంట ఈసీ చంద్రబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న, యుగంధర్, తదితరులు ఉన్నారు.